క్లుప్తంగా

సత్తయ్యకు అభినందనలు



సత్తయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తుర్కయంజాల్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన కొత్తకుర్మ సత్తయ్యను బుధవారం తుర్కయంజాల్‌లోని ఆయన నివాసంలో పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బద్దం వెంకట్‌రెడ్డి, కొండూరు వెంకటేశ్, జొన్నాడ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖలీల్‌కు పరామర్శ



ఖలీల్‌ను పరామర్శిస్తున్న వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎం.ఎ. ఖలీల్ అనారోగ్యంతో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి బుధవారం ఖలీల్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. చల్లా వంశీచంద్‌రెడ్డి వెంట పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ వెంకటమ్మ తెలిపారు. ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిని వెలిగిస్తున్న స్వాములు

కడ్తాల్: మండల కేంద్రంలోని శివాలయంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమం బుధవారం గురుస్వాములు విజయ్‌గౌడ్, మహేశ్, శ్రీకాంత్, మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు ఆలపించిన అయ్యప్ప గీతాలతో ఆలయ ప్రాంగణమంతా మారుమోగింది. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి చంద్రమోహన్‌నాయర్ స్వామి పర్యవేక్షణలో స్వాములకు ఇరుముడిధారణ నిర్వహించారు. భక్తులకు స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నదానం నిర్వహించారు. ఇరుముడి పూజ చేసిన స్వాములు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో శ్రీను, యాదగిరి, పాండు, శ్రీకాంత్, వంశీ, సైదులు, లక్ష్మయ్య, శ్రీశైలం ఉన్నారు.

ఆక్రమణలపై కొరడా

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు కొరడా ఝళిపించారు. మండల పరిధిలోని పసుమాములలో సర్వే నంబర్ 386, బాచారం గ్రామంలోని సర్వే నంబర్ 214లోని అక్రమ నిర్మాణాలను గుర్తించిన రెవెన్యూ అధికారులు స్థానిక ఆర్‌ఐ నిజాముద్దీన్ ఆధ్వర్యంలో నేలమట్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని ఆర్‌ఐ నిజాముద్దీన్ హెచ్చరించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకూడదని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ అన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ క్లీనింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం బ్రాహ్మణపల్లి, కొహెడలోని టాయిలెట్లను శుభ్రం చేయించడంతో పాటు, వాటి ఎదుట రంగు రంగుల ముగ్గులను వేయించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. పలు చోట్ల ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు.

పట్నంపై మల్‌రెడ్డి మార్క్

- సొంత టీంపై రంగారెడ్డి నజర్
- పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలపై ఫోకస్
- క్యాంపు కార్యాలయానికి మరమ్మతులు
- 17 నుంచి నియోజకవర్గంలో పర్యటనలు



ఎమ్మెల్యేను కలిసిన పోలీస్ అధికారులు (ఫైల్)

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గంలో తన మార్క్‌ను చూపేందుకు కసరత్తు ప్రారంభించారు. సొంత టీం ఏర్పాటులో ఆయన బిజీగా ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పక్కాగా అమలు కావాలంటే నమ్మకమైన అధికారులుంటేనే సాధ్యమనే అభిప్రాయంలో ఆయన ఉన్నారు. నియోజకవర్గంలో ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, యాచారం తదితర ప్రాంతాల్లో ప్రముఖ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిజాయతీ గల అధికారులను నియమించుకుంటే అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సాఫీగా సాగుతాయనే భావనలో మల్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు మంత్రివర్గ విస్తరణలో బెర్త్ ఖాయమనే ధీమాలో ఆయన ఉన్నారు. కేబినెట్‌లో చోటు కోసం ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి, తన సోదరుడు మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. సీఎం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

పోలీస్ శాఖపై గురి

రంగారెడ్డి ముందుగా పోలీస్ శాఖలో బదిలీలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. తాజాగా రాచకొండ సీపీగా సుధీర్‌బాబు నియమితులు కావడంతో.. నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లల్లో ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించే అధికారులను ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, అబ్దుల్లాపూర్‌మెట్, యాచారం, మంచాల పోలీస్‌స్టేషన్ల సీఐలతో పాటు ఎస్‌ఐలను మార్చే యోచనలో ఎమ్మెల్యే ఉన్నట్లు సమాచారం. బదిలీల జోరు ఊపందుకోవడంతో ఇప్పటికే నియోజకవర్గంలోని పలువురు పోలీస్ అధికారులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో కొందరు పోలీస్ అధికారులు కాంగ్రెస్ శ్రేణులను ఇబ్బందులు పెట్టారని, వారిని తక్షణమే బదిలీ చేయాలని రంగారెడ్డికి ఫిర్యాదులు కూడా చేశారు. పోలీస్ శాఖతో పాటు రెవెన్యూ, మండల పరిషత్ అధికారులను కూడా బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు ఎమ్మెల్యే సన్నిహితులు చెబుతున్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్లను కూడా బదిలీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సొంత టీం ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

క్యాంపు కార్యాలయానికి మరమ్మతులు

ఈ నెల 17 తర్వాత పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని రంగారెడ్డి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మరమ్మతులు చేయిస్తున్నట్లు సమాచారం. వారంలో మూడు రోజులు ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో, మరో మూడు రోజులు తొర్రూర్ క్యాంపు ఆఫీసులో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి.

అయోమాయంలో 'డబుల్' లబ్ధిదారులు



మంచాల మండలంలోని లింగంపల్లి గేట్ వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్లు

మంచాల: మంచాల మండలంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. పోరాట ఫలితంగా గత ప్రభుత్వం అర్హులను గుర్తించిందని, తీరా పంపిణీ చేసే సమయానికి ప్రభుత్వం మారిందని, కొత్త ప్రభుత్వం పాత లిస్ట్ ఆధారంగా కేటాయిస్తుందా లేకుంటే మరో లిస్ట్‌ను తయారు చేస్తుందా అనే అనుమానంలో లబ్ధిదారులున్నారు. ఆరేళ్ల క్రితం మంచాల మండల పరిధిలోని నోముల రెవెన్యూ పరిధిలోని 100, 101 సర్వే నంబర్లలో 96 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. మంచాల, లింగంపల్లి, నోముల గ్రామాలకు చెందిన ఇళ్లు లేని నిరుపేదలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దీంతో నోముల గ్రామంలో 85, మంచాల గ్రామంలో 276, లింగంపల్లి గ్రామంలో 96 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 460 దరఖాస్తులు రావడంతో లబ్ధిదారులు ఎంపిక కష్టంగా మారింది. గ్రామానికి 30 మంది చొప్పున లాటరీ పద్ధతిలో అర్హులను ఎంపిక చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చెన్నారెడ్డి గూడకు చెందిన ఐదుగురికి ఇళ్లు ఇవ్వాలని, అలాగే నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన రైతుకు కూడా ఇల్లు ఇవ్వాలని నిర్ణయించారు. మే నెలలోనే లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలని నిర్ణయం తీసున్నారు. కానీ.. కొన్ని అవాంతరాల వలన పంపిణీకి బ్రేక్ పడింది. ఎన్నికల లోపు ఇస్తారని అర్హులు భావించారు. అయితే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగి పోయి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో గతంలో గుర్తించిన లబ్ధిదారులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తారా.. లేకుంటే కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారా అనే అయోమాయం నెలకొంది.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ తదితరులు

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో కోట మైసమ్మ ఆలయ నిర్మాణంతో పాటు, భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు రెండు గదుల నిర్మాణానికి, గ్రామ సర్పంచ్ రామునాయక్, స్థానిక నాయకులతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రామునాయక్ మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతో భక్తిభావం మరింత పెంపొందుతుందన్నారు. ధ్వజస్తభం, మిని వాటర్ ట్యాంకు నిర్మాణానికి సర్పంచ్ రూ.2 లక్షలు, స్థానిక నాయకుడు రతన్‌స్వామి ఆలయ నిర్మాణం, గదుల నిర్మాణానికి రూ.4 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రతన్, రమేశ్, సాయిలాల్, శంకర్, మాదార్, భాస్కర్, లక్ష్మణ్, కిరణ్, మల్లేశ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులివ్వాలి

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి

తలకొండపల్లి: కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేషన్ కార్డుల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. పదేళ్లుగా రేషన్ కార్డుల మంజూరు నిలిపేశారని, కొత్త ప్రభుత్వం నూతన రేషన్ కార్డులిస్తుందని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో కార్డులు ఎంతో కీలకమన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మల్‌రెడ్డికి శుభాకాంక్షలు



రంగారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ మాజీ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ జహంఘీర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాదయ్య, రమేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డిని కలిసిన నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ ఉప సర్పంచ్ చెరుకు కావ్య ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌గౌడ్, మారగోని శ్రీరాములు గౌడ్, ఎండీ నసీరుద్దీన్, ప్రభాకర్ ముదిరాజ్, సలీం, నవాజ్, ఎండీ ఫరీద్ పాల్గొన్నారు.

చల్లాను కలిసిన సర్పంచ్‌లు



వంశీచంద్‌రెడ్డిని కలిసిన సర్పంచ్‌లు తదితరులు

తలకొండపల్లి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీ బుధవారం ఉదయం 9 గంటలకు కడ్తాల్‌లో ప్రారంభమై నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు కాడమోని శ్రీశైలం, బండి రఘుపతి వంశీచంద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సముచిత స్థానం కల్పించాలని కోరారు.

పొంగులేటిని కలిసిన మహిపాల్‌రెడ్డి



పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి

తుర్కయంజాల్: గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు మహిపాల్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సబితారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాలనీల ప్రతినిధులు

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన సబితారెడ్డిని మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఇందిరాదేవేందర్, సర్పంచ్ భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జంగయ్య, దేవేందర్ నాయకులు రేవంత్‌రెడ్డి, లచ్చానాయక్, జంగారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 3వ డివిజన్‌కు చెందిన కాలనీల ప్రతినిధులు సబితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు సిరూర్ బాల్‌రాజ్, కాలనీవాసులు ప్రభాకర్‌రావు, విజయ్‌కుమార్, ఓంకుమార్ పాల్గొన్నారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శులు బాలకిషన్, అరవింద్ శర్మలు సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లలో తన విజయం కోసం పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు సబితారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

పేదల సంక్షేమానికి కృషి

- అన్నివర్గాలు సహకరించాలి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- బోర్ మోటర్లు, కుట్టుమిషన్లు, గేదెల పంపిణీ



కడ్తాల్: బోర్ మోటార్లను పంపిణీ చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఎస్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెంచులకు వ్యవసాయ బోర్ మోటర్లు, కుట్టుమిషన్‌లు, గేదెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం ఖాయమని పేర్కొన్నారు. పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని, అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారంటీలను అమలు చేశారని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ సహకరించాలని కోరారు. అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీడీఓ రామేశ్వరి దేవి, చెంచు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, లోన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, శంకర్, నాగమణి, రాములుగౌడ్, నిర్మలాదేవి, రవీందర్, ఉప సర్పంచ్ రామకృష్ణ, ఏపీఎం రాజేశ్వరి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత




అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 212లో స్మశాన వాటికకు కేటాయించిన ప్రభుత్వ భూమిలోని అక్రమ నిర్మాణాలను అధికారులు బుధవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య విలేకరులతో మాట్లాడుతూ అధికార యంత్రాంగం ఎన్నికల హడావుడిలో ఉండగా, కబ్జాదారులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారని ఆర్డీఓ, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, ఈ నెల 11వ తేదీన జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారుల్లో కదలిక వచ్చిందని తెలిపారు. అధికారులు కబ్జాదారులకు వత్తాసు పలకకుండా చర్యలు తీసుకోవడం శుభ పరిణామమని కొనియాడారు.

మొక్కలంటే లెక్కేలేదు!

- అడ్డగోలుగా పడేసిన వైనం
- పట్టించుకోని హెచ్ఎండీఏ అధికారులు



అడ్డగోలుగా పడవేసిన మొక్కలు

ఇబ్రహీంపట్నం రూరల్: మొక్కలంటే లెక్కే లేకుండా పోయింది. మొక్కుబడిగా మొక్కలు నాటి మిగిలిన వాటిని అడ్డగోలుగా వదిలేశారు. లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న హెచ్ఎండీఏ అధికారులు నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యవరిస్తున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్‌రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్డు పక్కల నెల రోజుల క్రితం హెచ్ఎండీఏ అధికారులు మొక్కలు నాటారు. మిగిలిన వాటిని నర్సరీలకు తరలించకుండా ఎక్కడ పడితే అక్కడే వదిలేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ర్యాలీకి తరలిన నాయకులు



ర్యాలీకి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందండంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటలకు కడ్తాల్ మండల కేంద్రంలో ప్రారంభమై.. ఆమనగల్లు పట్టణం మీదుగా నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వెల్జాల్ ఉప సర్పంచ్ అజీజ్, ఎంపీటీసీ అంబాజీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెల్జాల్, మాదాయపల్లి, ఇస్రాయిపల్లి, తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కడ్తాల్‌కు తరలివెళ్లారు. ర్యాలీకి వెళ్లిన వారిలో ఉప సర్పంచ్ అజీజ్ ఎంపీటీసీ అంబాజీ, ఆరిఫ్, నర్సింలు, వెంకట్‌రెడ్డి, అశోక్‌బాబు, రమేశ్, శ్రీశైలం, గౌస్, లక్ష్మయ్య, ఎల్లయ్య, రాజు, రహమత్, యాదగిరి, నవీన్, ప్రసాద్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- సమస్యలపై ఏకరవు
- విద్యుత్ ఏఈపై మండిపడ్డ సభ్యులు
- బెల్ట్ షాపులు ఎత్తేయాలని డిమాండ్



విద్యుత్ ఏఈని ప్రశ్నిస్తున్న ఎంపీపీ సుకన్య, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

యాచారం: మండల కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కొప్పు సుకన్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. సభ్యుల ప్రశ్నలు, ఫిర్యాదులతో గందరగోళంగా మారింది. వైస్ ఎంపీపీ కె. శ్రీనివాస్‌రెడ్డి, ధర్మన్నగూడ సర్పంచ్ భాషయ్య, మల్కీజ్‌గూడ సర్పంచ్ యాదయ్య, నానక్‌నగర్ సర్పంచ్ పెద్దయ్య విద్యుత్ సమస్యలపై ఏఈ సందీప్‌కుమార్‌ను ప్రశ్నించారు. రైతుల ప్రాణాలు పోతే గానీ పట్టించుకోరా.. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలతో ప్రమాదాలకు గురవుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎంపీపీ జోక్యం చేసుకొని గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాలను, వైర్లను తొలగించాలని సూచించారు. ఫిర్యాదులు చేసిన ప్రజాప్రతినిధులను గౌరవించాలని సూచించారు. మళ్లీ సర్వసభ్యసమావేశం లోపు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

సిబ్బందికి జీతాలే లేవు

మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో రూ.60 లక్షల విద్యుత్ బకాయిలున్నాయని, చెల్లించకపోతే కార్యాలయాలకు, తాగునీటి బోరుబావులకు విద్యుత్ సరఫరా నిలిపేస్తారని మండల పంచాయతీ అధికారి ఉమారాణి తెలియజేశారు. దీంతో ప్రభుత్వం నుంచి పంచాయతీలకు నిధులు రావడం లేదు, ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలివ్వడానికే ఇబ్బందిగా ఉందని, విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించాలని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు సభలో వాపోయారు. నిధులు లేవని, విద్యుత్ బకాయిలు మాఫీ చేసేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని సర్పంచులు కోరారు.

బెల్టు దుకాణాలు తీసేయండి

గ్రామాల్లో మద్యం ఎరులై పారుతోందని, యువత మద్యానికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, బెల్టు షాపులు తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఎక్సైజ్ పోలీస్ అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో దాదాపు 250కి పైగా బెల్టు దుకాణాలు ఉన్నాయని తెలిపారు. అదే విధంగా యాచారం– కందుకూర్ రోడ్డులో మండల కేంద్రంలో ఉన్న వైన్స్ షాపును మరో ప్రదేశానికి మార్చాలని కోరారు. రోడ్డుపైనే మద్యం దుకాణం ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎంపీపీ జోక్యం చేసుకొని మద్యం దుకాణాన్ని మార్చాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నింబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని ఎంఈఓ వెంకట్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. పురుగులు పట్టిన బియ్యం వస్తున్నాయని, విద్యార్థులు వాంతులు, విరేచనాలు చేసుకుని అస్వస్థతకు గురవుతున్నారని సభ్యులు ఏకరవు పెట్టారు.

నిధుల మంజూరులో నిర్లక్ష్యం

మండల పరిషత్, పంచాయతీలకు నిధులు మంజూరు చేసే విషయంలో గత కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఎంపీపీ సుకన్య పేర్కొన్నారు. నిధులు ఇవ్వకపోగా పంచాయతీలనే విద్యుత్ బిల్లులు చెల్లించాలంటే ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేస్తుందో లేదో చూడాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తాండ్ర లక్ష్మమ్మ, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీపతిగౌడ్, ముప్పిడి బావయ్య తదితరులు పాల్గొన్నారు.